క్లుప్తంగా

ఎమ్మెల్యే బాలరాజుకు ఎంపీ శ్రీధర్ పరామర్శ



బాలరాజును పరామర్శిస్తున్న ఎంపీ శ్రీధర్

బుట్టాయగూడెం : ఇటీవల అనారోగ్యానికి గురై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజును బుధవారం ఎంపీ కోటగిరి శ్రీధర్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్యస్థితిపై అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని మళ్లీ ప్రజాసేవలో పాల్గొనాలని ఆయన కోరారు. మేడవరపు విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

సాయి సత్యవ్రతాలు



సామూహిక సత్యవ్రతాల్లో పాల్గొన్న భక్తులు

పోలవరం రూరల్ : పోలవరం గ్రామంలోని అఖండ గోదావరి నదీ తీరంలో గల షిర్డీ సాయిబాబా ఆలయ 28వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం బాబాకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారికి విభూధి అర్చన పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం మహిళలు సామూహిక సాయి సత్యవ్రతం పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. గురువారం అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

అయ్యప్పకు అభిషేకాలు

జంగారెడ్డిగూడెం రూరల్ : గురవాయిగూడెం శ్రీ అయ్యప్ప స్వామి క్షేత్రంలో బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అయ్యప్ప స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అర్చకులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. అయ్యప్ప చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

సరమ్మ పేరంటాల ఉత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న సరమ్మ, నాగయ్య దేవతామూర్తులు

లింగపాలెం : లింగపాలెం గ్రామదేవత సరమ్మ పేరంటాల ఉత్సవాలు బుధవారం నుంచి అత్యతంవైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా బుధవారం నుంచి ఈనెల 5వ తేదీ వరకు అమ్మవారిని గ్రామంలో ఊరేగిస్తారు. 6న మధ్యాహ్నం 12 గంటలకు అమ్మవారి అగ్నిగుండ ప్రవేశం నిర్వహిస్తారు. 13వ తేదీన అన్నసమారాధనతో ఉత్సవాలు ముగుస్తాయి. ఈ ఉత్సవాలకు స్థానికులతో పాటు ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు.

నవధాన్యాల సాగుపై అవగాహన పెంచుకోవాలి



మెరకగూడెంలో నిర్వహిస్తున్న ర్యాలీ

బుట్టాయగూడెం : నవ ధాన్యాల పంటలు పండించడంపై రైతులు అవగాహన పెంచుకోవాలని ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి గురువింద లక్ష్మి అన్నారు. మండలంలోని మెరకగూడెంలో ప్రకృతి వ్యవసాయంలో 30 రకాల చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కలిగించేందుకు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయానికి ముందు పొలాల్లో నవ ధాన్యాలు వేయాలని సూచించారు. నవధాన్యాల పంట వల్ల దిగుబడి పెరగడమే కాకుండా రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయన్నారు.

జబర్దస్త్ కళాకారుల సందడి



తిరునాళ్లలో సందడి చేస్తున్న జబర్దస్త్ కళాకారులు

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి) : జీలుగుమిల్లిలో జగదాంబ అమ్మవారి తిరునాళ్లు ప్రశాంతంగా జరుగుతున్నాయి. మూడవ రోజైన బుధవారం రాత్రి సినీ ఆర్కెస్ట్రాతో పాటు జబర్దస్త్ కళాకారులు సందడి చేశారు. వినోదిని, గడ్డం నవీన్‌తోపాటు పలువురు కళాకారులు పలు స్కిట్‌లు చేసి తిరునాళ్లకు వచ్చిన భక్తులను అలరింపజేశారు. ఉత్సవాలలో ఆలయ కమిటీ చైర్మన్ చాట్రాతి భవానీశేఖర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గూడవల్లి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ మొడియం రామచంద్రరావు, చిట్టిబొమ్మ శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా నాటు పొగాకు సాగు

- లింగపాలెం మండలంలో గతేడాది కంటే అదనంగా 30 ఎకరాల్లో సాగు
- వాతావరణం అనుకూలిస్తే గట్టెక్కుతామని రైతుల ఆశాభావం
- ప్రారంభమైన పొగాకు పంట కోతలు
- కూలీలకు ఏర్పడిన డిమాండ్



కోసిన పొగాకును పందెరకు వేసిన దృశ్యం



మఠంగూడెంలో నాటు పొగాకు కోత కోస్తున్న రైతులు

లింగపాలెం : మెట్టప్రాంతమైన లింగపాలెం మండలం జిల్లాలోనే నాటు పొగాకు పంటను సాగుచేయటంలో ప్రసిద్ధి చెందింది. ఈప్రాంతంలో నేలలు అనువుగా ఉండటంతో నాటు పొగాకు పంటను ఇక్కడ రైతులు అధికంగా సాగు చేస్తారు. మండలంలో ఈ ఏడాది 2,400 ఎకరాల్లో నాటు పొగాకు పంటను రైతులు సాగుచేశారు. కోతలు ప్రారంభం కావడంతో.. కూలీలకు డిమాండ్ ఏర్పడింది. గతేడాది కంటే ఈ ఏడాది 30 ఎకరాల్లో అదనంగా పంటను ఇక్కడ రైతులు సాగుచేశారు. పొగాకు పంటను తోటలో సాగుచేసిన దగ్గర నుంచి కోత కోసేవరకు కంటికి రెప్పలా రైతులు చూసుకుంటారు. ఈపంటను పండించటం చాల కష్టతరం అని.. అయినా కష్టనష్టాలకు ఓర్చి పొగాకును పండిస్తామని రైతులు చెబుతున్నారు. ఈ పంటను కోయటం అందరికి చేత కాదు. కొంతమంది మాత్రమే ఈపనిచేస్తారు. దీంతో దూర ప్రాంతం నుంచి కూలీలను తీసుకువచ్చి పంట కోయిస్తారు. కోత కోసేందుకు కూలీలకు రూ.850 చొప్పున చెల్లిస్తున్నారు. కోసిన పొగాకును పురికొసతో కుట్టి పందెల్లకు కట్టి ఎండపెడతారు. కొద్దిరోజులు తరువాత మండివేస్తారు. అనంతరం పొగాకును అమ్మకాలు చేస్తారు. కోతలు ముమ్మరంగా సాగితే కూలీల కొరత ఎక్కువగా ఏర్పడుతుంది. దీంతో కూలి రేటుకూడ పెరుగుతుంది. ఎకరాకు రూ.70 నుంచి రూ.80 వేల వరకు పెట్టుబడి కాగా 4 నుంచి 5 పుట్లు పొగాకు దిగుబడులు వస్తాయి. గతేడాది పుట్టి పొగాకు రూ.27 నుంచి రూ.28 వేల వరకు అమ్మినట్లు రైతులు తెలిపారు. ఈ ఏడాది మార్కెట్ గత ఏడాది కంటే ఎక్కువగా అనుకూలంగా ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ పొగాకును వ్యాపారస్తులు రైతుల నుంచి కొనుగోలు చేసుకుని గుంటూరు మార్కెట్‌కు తీసుకెళతారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించి ధర కలిసివస్తే పెట్టిన పెట్టుబడులు పోను కష్టానికి తగిన ఫలితం ఉంటుందని రైతులు అంటున్నారు.

కూలీల కొరత ఉంది



నాటుపొగాకు కోతలు కోసేందుకు కూలీల కొరత ఉంది. రోజు కూలి రూ.850. ఈ కోతలు కోయటం అందరికి రాదు. కూలీల కొరతతో కోతలు కోయడం ఆలస్యం అవుతుంది. దీంతో పైరుకు నష్టం జరిగే పరిస్థితి ఉంటుంది. ఈ ఏడాది మార్కెట్ అనుకూలంగా ఉంటుందని ఆశిస్తున్నాం. ఖర్చులు ఎక్కువగా పెరిగిపోయాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే, ధర కలిసివస్తే పెట్టిన పెట్టుబడులు పోను కష్టానికి తగిన ఫలితం ఉంటుంది.

– రెడ్డిన శ్రీను, నాటు పొగాకు రైతు, రంగాపురం

ఉమారామలింగేశ్వరస్వామి కల్యాణం.. కడు రమణీయం



పార్వతీ పరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం బైనేరు నదితీరాన వేంచేసి ఉన్న శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రతి నెలా ఆరుద్ర నక్షత్రం రోజున నిర్వహించే పార్వతీ పరమేశ్వరుల కల్యాణం బుధవారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు మేడూరి రవితేజ శివయ్యకు, అమ్మవారికి కల్యాణం నిర్వహించినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఉభయదారులుగా మేక సింహాద్రి దంపతులు, గొగ్గులోతు శ్రీనివాసరావు దంపతులు, ఆనందం భాను ప్రకాష్ దంపతులు వ్యవహరించారు.

ఉత్సాహంగా పింఛన్ల పంపిణీ

కొయ్యలగూడెం : పింఛన్ల పంపిణీ కార్యక్రమం కొయ్యలగూడెం మండల వ్యాప్తంగా బుధవారం తెల్లవారుజాము నుంచే ప్రారంభమైంది. ఆయా ప్రాంత వలంటీర్లతో పాటు ఇటీవల నూతనంగా నియమితులైన సచివాలయ కన్వీనర్లు పింఛన్ల పంపిణీలో భాగస్వాములయ్యారు. మండల వ్యాప్తంగా ఉన్న 65 మంది గ్రామ సచివాలయ కన్వీనర్లను వలంటీర్లతో కలిసి పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగస్వాములు చేయాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆదేశించినట్లు జగనన్న సచివాలయ మండల కో–ఆర్డినేటర్ నూకల రాము పేర్కొన్నారు. కొయ్యలగూడెం మండల వ్యాప్తంగా పదివేల నూట ొక్క మందికి పింఛన్‌తో లబ్ధి చేకూరుతుందన్నారు. మొత్తం రూ. 2,80,93,250 లబ్ధిదారులకు అందజేస్తున్నామని, తొలి రోజు 69 శాతం పంపిణీ చేసినట్లు తెలిపారు.



పరింపూడి పంచాయతీ పరిధిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం



అనారోగ్యంతో మంచంపై ఉన్న లబ్ధిదారుడికి పింఛను అందజేస్తున్న వలంటీర్

కామవరపుకోట : గత కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ మంచానికి పరిమితమైన కామవరపుకోట కొత్తూరు గ్రామానికి చెందిన మొగలిగిద్దల సుబ్బారావుకు సచివాలయం-2 వలంటీర్ ఎన్.బాలు బుధవారం ఉదయం 6 గంటలకే పింఛన్ అందజేశాడు. దీనితో లబ్ధిదారుడు, అతని కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



మదనగోపాల స్వామి ఆలయంలో గోవింద నామ స్మరణతో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం : శ్రీ రుక్మిణి సత్యభామ సమేత మదన గోపాలస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ, నూతన ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 7.30 నిమిషాలకు ఏక సమయంలో మదన గోపాలస్వామి విగ్రహం, అదేవిధంగా ధ్వజస్తంభ, శ్రీ లక్ష్మీనరసింహ, వెంకటేశ్వర, గరుడ, ఆంజనేయ, విశ్వక్సేన శిఖర కళశ ప్రతిష్ఠాపనలు నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి సుమారు 10వేల మంది పైగా భక్తులకు అన్న సమారాధన చేశారు. సహస్రాధిక విగ్రహ ప్రతిష్ఠాపన ఆచార్యులు శ్రీమాన్ శ్రీనివాసుల శేషాచార్యుల శిష్య బృందం అగ్ని ప్రతిష్ఠాపన, మహాశాంతి హోమం కార్యక్రమాలు నిర్వహించగా పూర్ణకుంభం సమర్పణ అనంతరం భక్తులు హోమ గుండంలో ద్రవ్యాలు సమర్పించారు. ప్రతిష్ఠాపన అనంతరం మదన గోపాల స్వామికి ఇతర దేవతామూర్తులకు ముందుగా గోదర్శనం కల్పించారు. ఈనెల 6వ తేదీ వరకు తిరు కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ మద్దు గోపి, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈవో మంగళంపల్లి సంగమేశ్వర శర్మ, డైరెక్టర్లు చిటికెన సూర్యకుమారి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల మంజూరుకు సీఎంకు వినతి

కొయ్యలగూడెం: ఇళ్ల స్థలాల మంజూరుకు ప్రత్యామ్నాయ మార్గం చూడాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని అభ్యర్థించినట్లు పశ్చిమ డెల్టా బోర్డు చైర్ పర్సన్ గంజిమాల దేవి పేర్కొన్నారు. బుధవారం సీఎం పశ్చిమ జిల్లా పర్యటన నేపథ్యంలో హెలిపాడ్ వద్ద ఆయనను కలుసుకున్నట్లు తెలిపారు. పోలవరం నియోజకవర్గంలో కొయ్యలగూడెం, బుట్టాయిగూడెం, పోలవరం మండలాలలో అర్హత కలిగిన పేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేసిందని, అయితే కొన్నిచోట్ల స్థలాల ఆక్రమణదారులు కోర్టును ఆశ్రయించడంతో ప్రభుత్వ లక్ష్యం, పేదవాని కల అర్ధాంతరంగా నిలిచిపోయాయన్నారు. ఈ నేపథ్యంలో భూమిని కొనుగోలు చేసి అయినా సరే ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరడంతో సీఎం వైఎస్ జగన్ సానుకూలంగా స్పందించారన్నారు.



సీఎం వైఎస్ జగన్‌కు ఇళ్ల స్థలాల సమస్యను వివరిస్తున్న గంజిమాల దేవి

వైభవంగా శోభాయాత్ర

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని పాత ఆంధ్రాబ్యాంక్ వీధిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీ విజయదుర్గ అమ్మవారితో పాటు పంచభూత మరకత లింగేశ్వరస్వామి, తొమ్మిది దేవతామూర్తుల ప్రతిష్టా కార్యక్రమం శోభాయమానంగా ప్రారంభమైంది. బుధవారం ఉదయం 9.09 గంటలకు కలశ స్థాపనతో కార్యక్రమం ప్రారంభమైనట్లు ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షులు మారిశెట్టి రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి మాడా రామమోహనరావు తెలిపారు. ఉదయం 8.01 గంటలకు గంగానమ్మ అమ్మవారి దివ్యసన్నిధి నుంచి సప్తనదీజలాలతో, మంగళవాయిద్యాలు, వేదమంత్రాల మధ్య ప్రత్యేక వాహనంలో దేవతా మూర్తులను ఉంచి అష్టోత్తర కలశాలతో 300 పైగా ముత్తైదువులు శోభాయాత్ర నిర్వహించారు. దేవతామూర్తులకు సప్తనదీజలాలతో జలాధివాసం నిర్వహించారు. సాయంత్రం ఆరుగంటల నుంచి శ్రీరుద్ర సహిత చండీహోమం జరిపారు. గొర్తి సుబ్రమణ్యశర్మచే ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. వీరంపాలెం శ్రీబాలా త్రిపుర సుందరీ పీఠం ఆధ్యాత్మిక సేవా ప్రతినిధి ఈమని శశి కుమార్, దోర్బల ప్రభాకరశర్మ, మారిశెట్టి అంజన్ కుమార్, ఉదయశ్రీ దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కలశాలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న మహిళలు

రహదారుల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి



పంచాయతీకి దాతలు బహుకరించిన ట్రాక్టర్ ట్రక్కును ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీధర్

కొయ్యలగూడెం : జూన్ నెల నాటికి జాతీయ, రాష్ట్ర రహదారులు మొదలుకొని గ్రామీణ ప్రాంత రోడ్లు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందనున్నాయని ఎంపీ కోటగిరి శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం పరింపూడి సర్పంచ్ ముప్పిడి విజయకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రాక్టర్ ట్రక్కు ప్రారంభోత్సవ కార్యక్రమం ఎంపీ చేతుల మీదుగా నిర్వహించారు. రెండేళ్ల కరోనా కష్టకాలం, ఆపై అధిక వర్షాలతో రోడ్ల నిర్మాణానికి కార్మికుల పరంగా, కాలం అనుకూలించని కారణంగా జాప్యం అయిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇప్పుడు పూర్తిస్థాయిలో రోడ్ల అభివృద్ధిపై దృష్టి సారించిందని చెప్పారు. ఎంపీ నిధుల ద్వారా పరింపూడిలో డ్రెయినేజీ వ్యవస్థ అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీ కోటగిరి శ్రీధర్ పేర్కొన్నారు. మంతెన సూర్యావతి జ్ఞాపకార్థం కుమారుడు సొసైటీ అధ్యక్షుడైన మంతెన సోమరాజు సౌజన్యంతో రూ.2లక్షలతో తయారుచేసిన ట్రాక్టర్ ట్రక్కును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోతన తాతారావు, ఎంపీపీ గంజిమాల రామారావు, జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, జిల్లా టెలికాం అడ్వైజరీ మెంబర్ ఒంటిపల్లి వెంకటేశ్వరరావు, జగనన్న సచివాలయం మండల కోఆర్డినేటర్ నూకల రాము, మారిశెట్టి శ్రీను, కొల్లూరి సత్తిబాబు, కొల్లూరి యశ్వంత్, కారంకి గణేష్, మడుతూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన

కామవరపుకోట : స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలకు చెందిన చరిత్ర, పొలిటికల్ సైన్స్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులు గురువారం క్షేత్ర పర్యటనలో భాగంగా రాజధానిని సందర్శించారు. అమరావతి ప్రాముఖ్యతను తెలుసుకోవడంతోపాటు రాష్ట్ర సచివాలయ విభాగములను సందర్శించి పాలనా ప్రక్రియ గూర్చి అధికారుల ద్వారా తెలుసుకున్నారు. అనంతరం అసెంబ్లీ హాల్, హైకోర్టు కార్యాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థి ప్రతినిధి వాకా అలేఖ్య మాట్లాడుతూ క్షేత్ర పర్యటన ద్వారా పాలనా విధానాలను గురించి అవగాహన పొందామని అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పర్యటనలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవీంద్రబాబు, అధ్యాపకులు ఎం.మల్లేశ్వరరావు, డాక్టర్ జి.శ్రీనివాసరావు, వి.శ్రీనివాస్, మల్లేష్ ధారావతు, ఎం.హర్షవర్ధిని పాల్గొన్నారు.



అమరావతి సచివాలయాన్ని సందర్శించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

6న పాత కలప బహిరంగ వేలం

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని దామోదర సంజీవయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పాత బంగాళా పెంకు షెడ్లను నాడు-నేడు పనుల్లో తొలగించారని, ఈ క్రమంలో శిథిలమైన పాత కలప, పాత కిటికీ ఇనుప ఊచలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈనెల 6న వేలం వేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి.వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనాలనుకునే వారు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జంగారెడ్డిగూడెం బ్యాంకులో చెల్లుబాటు అయ్యేలా రూ. 500 డీడీ రూపంలో దరావతు చెల్లించాలన్నారు. వేలం దక్కించుకున్న వారు అదే రోజు మొత్తం నగదును డీడీ రూపంలో చెల్లించి, సామాగ్రిని స్వాధీనం చేసుకోవాలన్నారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలన్నారు.

గిరిజన గ్రామాలను షెడ్యూల్డ్ ప్రాంతంలో చేర్చాలి



టి.నరసాపురంలో జిల్లా మహాసభ గోడపత్రికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

టి.నరసాపురం : నాన్ షెడ్యూల్డ్ ప్రాంతంలో ఉన్న గిరిజన గ్రామాలను షెడ్యూల్డ్ ప్రాంతంలో చేర్చాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ డిమాండ్ చేశారు. టి.నరసాపురంలోని ప్రజా సంఘాల కార్యాలయం వద్ద బుధవారం మండల మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రామకృష్ణ మాట్లాడుతూ ఈనెల 27, 28 తేదీల్లో జీలుగుమిల్లిలో జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ గోడపత్రికలను విడుదల చేశారు. అనంతరం గిరిజన సంఘం మండల నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షులుగా గురుగుంట్ల సావిత్రి, కార్యదర్శిగా పూనం చిన సూర్యారావు ఎన్నికయ్యారు.

టేకూరులో పూరిళ్లు దగ్ధం

వేలేరుపాడు : మండలంలోని టేకూరు గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో గిరిజనులకు చెందిన మూడు పూరిళ్లు దగ్ధమయ్యాయి. దీంతో సుమారు రూ.3 లక్షల ఆస్తినష్టం సంభవించింది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన పూరెం కన్నయ్య, పూరెం భీమయ్య, పూరెం రాజమ్మ, ఇండ్లు పూర్తిగా కాలిపోయాయి. పూరెం కన్నయ్య ఇంట్లో గ్యాస్ సిలెండర్ లీకవ్వడంతో మంటలు చెలరేగాయి. ఇండ్లల్లో వస్తువులన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. కట్టుబట్టలతో బాధితులు బయటపడ్డారు.

గ్యాస్ ధర పెంపును తక్షణం ఉపసంహరించాలి

జంగారెడ్డిగూడెం : నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని, నల్ల డబ్బులు వెనక్కి తీసుకొచ్చి ప్రజలకు పంచుతామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం పేద మధ్యతరగతి వర్గాలు తీవ్ర ఇబ్బందులు గురయ్యే విధంగా పరిపాలన సాగిస్తోందని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యులు కేవీ రమణ బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రూ.450 గ్యాస్ బండ ఉంటే భారీ స్థాయిలో పెంచారని ఆందోళన చేపట్టిన బీజేపీ, అధికారంలోకి వచ్చాక కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చే విధంగా విపరీతంగా రేట్లు పెంచేస్తోందని విమర్శించారు. వంటగ్యాస్ ధర రూ.50, చిన్నచిన్న దుకాణాలు నిర్వహించే కమర్షియల్ బండ రూ.350 పెంచడం పేదల పొట్టకొట్టడమేనని, ఇప్పటికైనా పెంచిన ధరలు ఉపసంహరించకుంటే ఆందోళన చేపడతామని రమణ హెచ్చరించారు.

ఎస్ఈబీ అధికారుల దాడులు

చింతలపూడి : స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో చింతలపూడి మండలం, దేశవరం గ్రామంలో నాటు సారా తయారీ కేంద్రాలపై ఎస్ఈబీ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. దాడుల్లో 10 లీటర్ల నాటు సారా, సారా తయారీకి వినియోగించే గ్యాస్ స్టౌ, గ్యాస్ సిలెండర్‌లను స్వాధీనం చేసుకుని 1,600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. దాడుల్లో ఎస్ఈబీ సీఐ సాయి స్వరూప్, ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లూర్దు మాత ఉత్సవాలు ప్రారంభం

కామవరపుకోట: రోమన్ క్యాథలిక్ మిషన్ తడికలపూడి విచారణ పరిధిలో లూర్దు మాత ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈనెల 3వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తామని ఫాదర్ దోమతోటి నతానియలు తెలిపారు. మానవులకు ప్రేమ, త్యాగం, కరుణ చాటి చెప్పిన ఏసుక్రీస్తుకు తల్లి అయిన లూర్దు మాతాను ప్రజలు భక్తిశ్రద్ధలతో విశ్వసిస్తారని అన్నారు. ఈ ఉత్సవాలకు సహాయ సహకారాలు అందిస్తున్న విచారణ కర్త ఫాదర్ కళ్యాణ్ కుమార్‌కు, సంఘ పెద్ద మేరుగు సుందర్‌రావుకు, ఉపదేశకులకు, మరియ తల్లి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

6న విగ్రహ ప్రతిష్ఠ

టి.నరసాపురం : అప్పలరాజుగూడెంలో రూ.10 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న 15 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 6వ తేదీన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఇందులో భాగంగా బుధవారం విగ్రహాన్ని నిలబెట్టారు.

5న ధ్యాన శిక్షణ

జంగారెడ్డిగూడెం : ది పిరమిడ్ స్పిరిట్యువల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 5న ఉదయం 9:30 నుంచి 4:30 వరకూ లలితా సహస్రనామ అంతరార్థంపై ఒక రోజు ఆత్మజ్ఞాన ధ్యాన శిక్షణ నిర్వహిస్తున్నట్లు పిరమిడ్ ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు కాకి రామకృష్ణ, తటవర్తి కృష్ణ తెలిపారు. స్థానిక శేషాద్రి నగర్‌లోని శ్రీగౌరీసుభద్ర పిరమిడ్ ధ్యానమందిర అనుబంధ మైత్రేయ మందిరంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విజయవాడకు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ జీ.శ్రీదేవి శిక్షకురాలిగా వ్యవహరిస్తారన్నారు. శిక్షణలో పాల్గొన్న వారికి మధ్యాహ్నం సాత్విక శాఖాహార భోజనం అందిస్తామన్నారు.

పాఠశాల తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంఈవో రామారావు

లింగపాలెం : విద్యాప్రమాణాలు మరింతగా పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎంఈవో కె.రామారావు అన్నారు. ఆసన్నగూడెం ప్రాథమికోన్నత పాఠశాలను బుధవారం ఆయన వార్షిక తనిఖీ నిర్వహించారు. పాఠశాల రికార్డులు, నాడు-నేడు పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనంను ఆయన రుచిచూశారు. అనంతరం ఆయన విద్యార్థుల విద్యాప్రమాణాలను తరగతుల వారీగా, సబ్జక్టుల వారీగా పరిశీలించారు.

అమర వీరుల సంస్మరణ సభ

జంగారెడ్డిగూడెం రూరల్ : తాడువాయిలో మాదిగ అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కోకన్వీనర్ సిద్దు మాదిగ మాట్లాడుతూ 1994 సంవత్సరం నుంచి ఎంఆర్పీఎస్ ఉద్యమం ప్రారంభమైందన్నారు. మాదిగ అమరవీరుల ఆశయాలను వృథాగా పోనివ్వమని, అమరవీరుల ఆశయ సాధనను ముందుకు తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో మోటమర్రి జగన్, డి.సతీష్, కనగాల దానియేలు పాల్గొన్నారు.